




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :188 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ శనివారం- 08 - ఆగస్టు - 2026


## చేనేత రంగానికి ఎల్లప్పుడూ ప్రభుత్వ మద్దతు- 'ఆత్మనిర్భర్ భారత్' కల సాకారానికి ఇదొక మూలస్తంభం



★ సోషల్ మీడియాలో మరో కొత్త వీడియో విడుదల చేసిన మోదీ

★ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపు

★ దేశంలోని నేతన్నల కుటుంబాలకు మద్దతివ్వాలని సూచన

## షేక్ హసీనా వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు..
# బంగ్లాదేశ్‌కు స్పష్టం చేసిన భారత్..

- షేక్ హసీనా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం
- తన లక్ష్యం మళ్లీ అధికారంలోకి రావడం కాదని, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, అభివృద్ధి పునరుద్ధరించడమే



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆగస్టు 5న నిర్వహించిన మీడియా సమావేశం, ఆ దేశంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను తిరిగి బంగ్లాదేశ్ వెళ్లబోతున్నట్లు ప్రకటించడంతో పాటు మహ్మద్ యూనస్ పాలన, తనను పదవి నుంచి కిందకు దించడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే, న్యూఢిల్లీ నుంచి హసీనా చేసిన ఈ ప్రసంగంపై బంగ్లాదేశ్ తీవ్ర అభ్యంతరం తెలుపుతోంది. ఈ అంశం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను ప్రభావితం చేస్తుందని బంగ్లా వ్యాఖ్యానించింది. ఇదిలా ఉంటే, ఈ వ్యవహారంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. షేక్ హసీనా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఆ వ్యాఖ్యల్ని భారత్ సమర్థించడం లేదని తెలిపింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మిగతా..2లో

## ఒక దేశం మీద దాడి చేస్తే, 3 దేశాల మీద చేసినట్టే...
# పాక్, సౌదీ, టర్కీల మధ్య కీలక రక్షణ ఒప్పందం

- సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్ దేశాల మధ్య శుక్రవారం రోజున ఒక కీలక రక్షణ ఒప్పందం కుదిరింది.
- ఈ ఒప్పందం ద్వారా మూడు దేశాల మధ్య సైనిక సహకారం బలోపేతం కానుంది.



ఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో ఆందోళన చెందుతున్న అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, పాకిస్తాన్, టర్కీ శుక్రవారం మక్కాలో ఒక సంయుక్త రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశంలో సౌదీ అరేబియాలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌లు పాల్గొన్నారు. ఈ ముగ్గురి సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం మూడు దేశాల మధ్య సైనిక సహకారాన్ని బలోపేతం చేయనుంది. ఇందులో ఏ ఒక్క దేశంపై దాడి జరిగిన మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణించనున్నారు. మిగతా..2లో

## రాష్ట్రంలో వర్షాల కోసం వరుణ యాగం.



★ 10న నాగార్జునసాగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పూర్ణాహుతి.

★ కృష్ణా, గోదావరి జలకళ కోసం ప్రత్యేక పూజలు

హైదరాబాద్, ఆగస్టు 07 : రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, పాడిపంటలు సుభిక్షంగా పండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారు. వరుసగా వాయిదా పడుతున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### 10న నాగార్జునసాగర్‌లో మహా యాగం

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు సంప్రదించి నిర్ణయించిన

## సీఎం రేవంత్‌కు కేటీఆర్
# బహిరంగ లేఖ!

- జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు
- రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్





హైదరాబాద్ : జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. మిగతా..2లో

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

### చేనేత రంగానికి రూ.980 కోట్లు విడుదల

- పీపుల్స్ ప్లాజాలో వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తుమ్మల
- రైతన్నకు, నేతన్నకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యతను ఇస్తోందని వెల్లడి
- 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామన్న మంత్రి



హైదరాబాద్: చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను మిగతా..2లో

## వెలిగొండ ప్రాజెక్టుపై కీలక ఆదేశాలు.. ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు



కృష్ణా జలాలను తరలించేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

కొల్లం వాగు నుంచి టన్నెల్స్ ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు అవసరమైన అప్రోచ్ ఛానెల్ క్లియరింగ్ పూర్తైందన్నారు.

అమరావతి: వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, ఈ నెల మూడో వారంలోనే నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలను తరలించేలా చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి మిగతా..2లో

## తెలంగాణ ప్రాజెక్టులకు చట్టబద్ద అనుమతులపై సమీక్ష సరికాదు.జలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ



కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమీక్షించడం సరికాదన్నారు.

తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు

సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్,

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు పొందిన తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను మళ్లీ సమీక్షించే అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు జలశక్తి మంత్రికి, సెక్రటరీకి రాసిన లేఖను విడుదల చేశారు . కేంద్రం ఇప్పటికే చట్టబద్ధంగా ఇచ్చిన అనుమతులను గోదావరి నదీ యాజమాన్య మిగతా..2లో

## దేశంలో అత్యుత్తమ జోన్‌గా విశాఖ జోన్.. రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు




★ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఉత్తమ జోన్‌గా నిలిచిందన్న రైల్వే శాఖ

★ ఏపీలో ప్రస్తుతం రూ. 54 వేల కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి

★ మరో రూ.71 వేల కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయన్న రైల్వే శాఖ

అమరావతి : విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అతిస్వల్ప కాలంలోనే రికార్డు స్థాయి పురోగతి సాధించి, వార్షికంగా రూ.2,493 కోట్ల రాబడితో దేశంలోనే అత్యుత్తమ జోన్‌గా నిలిచిందని కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది.

## చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం..
# అందుకు ఈ పథకమే నిదర్శనం

- చీరాలలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం
- ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి
- చేనేత వర్గాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్, పెన్షన్ పథకాలను వివరించిన సీఎం
- చీరాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ



అమరావతి : రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం కొత్తపేట గ్రామంలో 'నేతన్న సేవలో' అనే కొత్త పథకాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 179 కోట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకునే ఆగస్టు 7వ తేదీని మరపురాని రోజుగా మార్చాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా, చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామనడానికి 'నేతన్న సేవలో' పథకమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది భారతీయ సంస్కృతికి, దేశం గర్వించదగ్గ కళకు ప్రతీక అని కొనియాడారు. ఒకప్పుడు చేనేత ఉత్పత్తులతో 'మినీ ముంబై'గా పేరుగాంచిన చీరాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత వర్గాల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ భరోసా కింద రూ. 4,000 పింఛను అందిస్తున్నామని, దీని ద్వారా 85 వేల మందికి ఏటా రూ. 420 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని,

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు
# భయమెందుకు?



- డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

అమరావతి : డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ,

మొదటి పేజి తరువాయి

## చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం.. అందుకు ఈ పథకమే నిదర్శనం

దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లు లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ. 79 కోట్లు అందించామన్నారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ. 10 కోట్లతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం తెలిపామని, హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమం ద్వారా కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో రూ. 4,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ద్వారా చేనేత రంగానికి మరింత ఊపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్ధసారధి తదితరులు పాల్గొన్నారు.

## షేక్ హసీనా వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు.. బంగ్లాదేశ్‌కు స్పష్టం చేసిన భారత్..

షేక్ హసీనా పాల్గొన్న కార్యక్రమం పూర్తిగా ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిందని చెప్పారు. 2024 ఆగస్టులో హింసాత్మక నిరసనల తర్వాత హసీనా బంగ్లా నుంచి భారత్ వచ్చి ఆశ్రయం పొందుతున్నారు. ఈ ఏడాది చివర్లో తాను తన సొంత దేశానికి వెళ్తున్నట్లు ప్రకటించారు. జైలు శిక్ష లేదా మరణశిక్ష ఎదురైనా ప్రజల కోసం స్వదేశానికి వెళ్తానని ఆమె చెప్పారు. తన లక్ష్యం మళ్లీ అధికారంలోకి రావడం కాదని, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, అభివృద్ధి పునరుద్ధరించడమే అని చెప్పారు. అవామీలీగ్‌పై నిషేధం ఎత్తాయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, తప్పుడు కేసులను విత్ డ్రా చేసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మహ్మద్ యూనస్ పాలనలో బంగ్లా పరిస్థితి మరో పాకిస్తాన్‌లా మారిందని హసీనా కుమారుడు అన్నారు. తనకు వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమం ఒక కుట్ర అని, పాలన మార్చాలని కుట్ర పన్నారని హసీనా ఆరోపించారు.

## దేశంలో అత్యుత్తమ జోన్‌గా విశాఖ జోన్.. రూ.2,493 కోట్ల ఆదాయంతో రికార్డు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.54,000 కోట్ల విలువైన రైల్వే అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, మరో రూ.71,000 కోట్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొంది. విశాఖ రైల్వే యార్డ్ ఆధునికీకరణ కోసం రూ.300 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా 6 కొత్త ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేసింది. అలాగే గుంతకల్-బళ్లారి నాలుగు లైన్ల విస్తరణకు రూ.1,205 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. రైళ్ల భద్రత కోసం 100 ఇంజిన్లలో 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపింది. ఏపీ వ్యాప్తంగా 300కు పైగా ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, అమృత్ భారత్ కింద 70కి పైగా స్టేషన్ల అభివృద్ధి, విజయవాడలో స్లీపింగ్ పాడ్స్, రాబోయే గోదావరి పుష్కరాల ముందస్తు ఏర్పాట్లతో రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను వేగంగా ఆధునీకరిస్తున్నట్లు వివరించింది.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి తెలిపారు. చేనేత రంగానికి ఇప్పటివరకు రూ.980 కోట్లు విడుదల చేశామని, అందులో చేనేత రుణమాఫీ కింద రూ.49.27 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. 'నేతన్న భరోసా' ద్వారా ఏడాదికి రూ.18,000 ఆర్థిక సాయం, 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, ఐఐహెచ్‌టీ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో వర్షాల కోసం వరుణ యాగం.

శుభ ముహూర్తం మేరకు ఈ నెల 10వ తేదీ ఆదివారం నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు.

### విజయవిహార్‌లో భారీ ఏర్పాట్లు

నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో యాగ నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాగ కార్యక్రమం జరుగుతుంది. యాదగిరిగుట్ట దేవస్థానం నుండి ప్రముఖ అర్చకులు, వేదపండితులు, రుత్వికులు వచ్చి వేద మంత్రాలతో యాగ క్రతువులను నిర్వహిస్తారు.

### జలాశయాలు, పంటల కోసం సంకల్పం

కృష్ణా, గోదావరి నదులు పొంగి ప్రవహించాలని, రాష్ట్రంలోని చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవాలని యాగంలో ప్రత్యేక సంకల్పం చేయనున్నారు. వర్షాలతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలనిలి ప్రార్థనలు చేయనున్నారు. మంత్రి ఉత్తమ్ సారథ్యం, సీఎం పూర్ణాహుతి ఈ వరుణ యాగానికి రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యం వహిస్తున్నారు. యాగం మొత్తం 3 రోజుల పాటు కొనసాగుతుంది. యాగం చివరి రోజున జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### ప్రజలకు పిలుపు

వర్షాల కోసం జరిగే ఈ యాగంలో ప్రజలందరూ పాల్గొని దైవాన్ని ప్రార్థించాలని ప్రభుత్వం కోరింది. యాగం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు చట్టబద్ధ అనుమతులపై సమీక్ష సరికాదు.జలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ



బోర్డు సమీక్షించడం సరికాదన్నారు. అజెండా లో పేర్కొన్న అంశాలను ఉపసంహరించు కోవాలని, పెండింగ్‌లో ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, హైడ్రోలాజికల్, ఇంజనీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను కేంద్ర జల సంఘం , జలశక్తి మంత్రిత్వ శాఖలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ అత్యున్నత సంస్థలు చట్టబద్ధంగా అనుమతులు ఇచ్చిన తర్వాత, ఆ నిర్ణయాలను మళ్లీ సమీక్షించే లేదా రద్దు చేసే అధికారం గోదావరి బోర్డు లాంటి కింది స్థాయి సంస్థకు ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను మళ్లీ సమీక్షించేందుకు జీఆర్ఎంబీకి అవకాశం ఇస్తే, అది కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాధాన్యతను తగ్గించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలోని కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంత్ రెడ్డి, ముక్తేశ్వరం, చనాక-కొరట, మోడికుంటవాగు, కడెం-గూడెం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ వంటి కీలక ప్రాజెక్టులకు సుదీర్ఘ ప్రక్రియ తర్వాతే అనుమతులు వచ్చాయని, ఇప్పుడు వాటిని మళ్లీ సమీక్షించాలని ఎజెండాలో పెట్టడం సరికాదని పేర్కొన్నారు. దీని వల్ల తెలంగాణలో సాగునీటి అభివృద్ధి కుంటుపడటంతో పాటు, కోట్లాది మంది రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఇప్పటికే హైడ్రోలాజికల్ అనుమతులు పొందిన సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకానికి మిగిలిన చట్టబద్ధమైన అనుమతులను కూడా మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం సకాలంలో జోక్యం చేసుకుని తెలంగాణ నీటి హక్కులను కాపాడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

మొదటి పేజి తరువాయి

నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.

2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం



నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి. "చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఒక దేశం మీద దాడి చేస్తే, 3 దేశాల మీద చేసినట్టే... పాక్, సౌదీ, టర్కీల మధ్య కీలక రక్షణ ఒప్పందం

మొదటి పేజి తరువాయి

ఏదైనా దురాక్రమణకు వ్యతిరేకంగా ఉమ్మడి నిరోధక శక్తినిబలోపేతం చేయడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్ గా పిలిచే ఈ ఒప్పందంలో ప్రతి దేశం ఆమోదించిన నిర్దిష్ట బాధ్యతలు లేదా కట్టుబాట్ల వివరాలను ప్రకటనలో వెల్లడించలేదు. అయితే ప్రాంతీయంగా, గ్లోబల్‌గా శాంతి, భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించడమే ఈ ఒప్పంద లక్ష్యమని ప్రకటనలో పేర్కొన్నారు. "ఈ ఒప్పందంలో ఒక సామూహిక రక్షణ నిబంధన ఉంది. ఇది పూర్తిగా రక్షణాత్మకమైనది... కేవలం రక్షణ కోసం మాత్రమే పరస్పర మద్దతు ఇస్తామని వాగ్దానం చేస్తుంది" అని ఒక టర్కీ అధికారి



అన్నారు. ఈ ఒప్పందం ఏ నిర్దిష్ట దేశానికి వ్యతిరేకంగా లేదని చెప్పారు. ఇప్పటికే ఉన్న ఏ ద్వైపాక్షిక లేదా బహుపాక్షిక ఒప్పందాలను రద్దు చేయడం గానీ, వాటి స్థానంలో కొత్తవాటిని తీసుకురావడం గానీ చేయలేదని తెలిపారు. అయితే ఈ ఒప్పందం గణనీయమైన సైనిక సామర్థ్యాలు కలిగిన మూడు ప్రధాన ప్రాంతీయ శక్తులైన సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్తాన్‌లను ఏకతాటిపైకి తెస్తుంది. సౌదీ అరేబియా ఒక ప్రధాన చమురు ఉత్పత్తిదారు కాగా, పాకిస్తాన్ అణ్వాయుధాలు కలిగిన దేశంగా ఉంది. మరోవైపు టర్కీ నాటోలో రెండవ అతిపెద్ద సైన్యాన్ని, అభివృద్ధి చెందుతున్న డిఫెన్స్ రంగాన్ని కిలి ఉంది. ఈ ఒప్పందంలో భాగంగా మూడు దేశాలు ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, నిఘా సమాచార భాగస్వామ్యం ఉండవచ్చని టర్కీకి చెందిన హబెర్టర్క్ టెలివిజన్ నివేదించింది. అయితే ఈ వివరాలను మూడు ప్రభుత్వాలు ధ్రువీకరించలేదు. ఇక, ఈ పరిణామంపై భారత్ స్పందించింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ... "మేము కూడా ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నాము... మేము మీకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తాము" అని అన్నారు.

## చేనేత రంగానికి ఎల్లప్పుడూ ప్రభుత్వ మద్దతు- 'ఆత్మనిర్భర్ భారత్' కల సాకారానికి ఇదొక మూలస్తంభం

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ : చేనేత రంగానికి ప్రభుత్వ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గ్రామీణ సాధికారత, మహిళల అభివృద్ధి అలాగే ఆత్మనిర్భర్ భారత్ కలను సాకారం చేయడంలో ఇదొక మూలస్తంభంగా అభివర్ణించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మోదీ శుక్రవారం ఎక్స్ లో ఒక ట్వీట్ చేశారు. తరతరాలుగా మన సాంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న దేశంలోని చేనేత కార్మికులు, కళాకారుల నైపుణ్యాన్ని, సృజనాత్మకతను, వారి అంకితభావాన్ని మోదీ కొనియాడారు. ప్రజలు తమకు ఇష్టమైన చేనేత దుస్తులు లేదా ఉత్పత్తులను ధరించి, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోవాలని మోదీ ఇప్పటికే పిలుపునిచ్చారు. దీనివల్ల చేనేత రంగంపై ఆధారపడిన ఎంతో మందికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను చేనేత వస్త్రాల వైపు ఆకర్షించేందుకు, ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని, వాటి వీడియోలను పంచుకోవాలని మోదీ విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి ఇన్‌స్టాగ్రామ్ వీడియో ద్వారా ఇందుకు సంబంధించి ఓ వీడియో పోస్టు చేశారు. చేనేత దినోత్సవ వేడుకలు నేత కార్మికులకు, చిరు వ్యాపారులకు చేయూతనివ్వడమేనని ఆయన పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతిఏటా ఆగస్టు 7న జరుపుకొంటారు. స్వదేశీ వస్తువులను ప్రోత్సహించి, స్వావలంబనను పెంపొందించడంకోసం గుర్తుగా 1905 నాటి స్వదేశీ ఉద్యమానికి ఇది గుర్తుగా నిలిచింది.

### 'చేనేతకు స్వాతంత్ర్య పోరాటంతో బలమైన అనుబంధం ఉంది'

మరోవైపు, చేనేతకు భారత స్వాతంత్ర్య పోరాటంతో బలమైన అనుబంధం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం అధికారికంగా ప్రారంభమైందని, బంగాల్ విభజనకు నిరసనగా మొదలైన ఈ ఉద్యమం, స్వదేశీ వస్తువులు, స్వదేశీ పరిశ్రమలు, ముఖ్యంగా దేశంలోని చేనేత కార్మికులను ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో జరిగిన 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ముర్ము ప్రసంగించారు. అదేవిధంగా, చేనేత రంగంలో అత్యున్నత పౌరపురస్కారంగా పరిగణించే సంత్ కబీర్ చేనేత అవార్డులను ముగ్గురు కళాకారులను రాష్ట్రపతి అందజేశారు. శతాబ్దాల కాలంనాటి నేత సంప్రదాయాలను పరిరక్షిస్తున్న కళాకారులను గౌరవిస్తూ ఈ అవార్డులను బహుకరించారు. 22 మంది నేత కార్మికులు, డిజైనర్లు, సహకార సంఘాలు, పారిశ్రామికవేత్తలకు జాతీయ చేనేత అవార్డులు 2025ను ప్రదానం చేశారు. బిచిత్‌పార్ ఖాదీ చీరను నేసినందుకు గానూ ఒడిశాకు చెందిన రామ్ మెహర్ అవార్డును అందజేయగా, ముగా సిల్క్ చీరకు అవార్డును అసోంకు చెందిన రునిమా చేతియా చౌధురి అందుకున్నారు. అలాగే, ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన షా మహమ్మద్ అన్సారీ అరుదైన జర్బఫ్ట్ శౌతమ్బరి అవధ్ జమ్దాని చీరతో చేసిన తన పనికి గుర్తింపు పొందారు. మిగిలిన 19 మందికి వీవింగ్ (నేత), డిజైన్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి వివిధ విభాగాల్లో జాతీయ చేనేత అవార్డులను బహుకరించారు.

### చేతివృత్తి మన సంస్కృతి సంప్రదాయాలకు ఒక రూపం

ఇదిలా ఉండగా, చేతివృత్తి కేవలం ఉపాధికి సంబంధించిన అంశం కాదని, అది మన సంస్కృతి సంప్రదాయాలకు రూపమని అని అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఉద్ఘాటించారు. చేనేత వారసత్వానికి సజీవ రూపమని, ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం దశాబ్ద కాలంగా కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ కార్యక్రమాల ద్వారా 77,000 మంది చేనేత కార్మికులు సాంప్రదాయ హస్తకళలను కాపాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతాన్ని ఇస్తున్నారని పేర్కొన్నారు. దేశీయ చేనేత వస్త్రాలు, జీఐ-ట్యాగ్ ఉన్న ఉత్పత్తులను మార్కెట్లలోకి చేరవేస్తున్నారని తెలిపారు.

## వెలిగొండ ప్రాజెక్టుపై కీలక ఆదేశాలు.. ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు

మొదటి పేజి తరువాయి

నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రాజెక్టు పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్, ఎస్‌ఈలు, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, కొల్లం వాగు నుంచి టన్నెల్స్ ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు అవసరమైన అప్రోచ్ ఛానెల్ క్లియరింగ్ పూర్తైందన్నారు. రెండు టన్నెల్స్‌లో మిగిలిన 286 మీటర్ల లైనింగ్ పనులు మరో 10 రోజుల్లో పూర్తవుతాయని, టన్నెల్-2లో చిక్కుకుపోయిన టిబిఎం (టీబీ) యంత్రాన్ని తొలగించే ప్రక్రియ కూడా వారం రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. 1,900 మెట్రిక్ టన్నుల



బరువున్న టిబిఎం యంత్రంలో ఇప్పటికే 1,300 మెట్రిక్ టన్నులను వెలికితీసినట్లు, మిగిలిన 600 మెట్రిక్ టన్నులను కూడా 10 రోజుల్లో పూర్తిగా తొలగిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన మంత్రి, ఐదేళ్లలో టిబిఎం యంత్రాన్ని తొలగించలేకపోయారని, చుక్క నీరు కూడా ఇవ్వకుండా ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని ప్రచారం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం రూ.450 కోట్లతో ఫీడర్ కెనాల్‌లో కేవలం ఆరు నెలల్లోనే 5.3 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ నిర్మించి, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసిందన్నారు. నిర్వాసితుల పునరావాసంపై కూడా మంత్రి కీలక వివరాలు వెల్లడించారు. మొత్తం 7,321 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,560 కుటుంబాలకు రూ.318 కోట్లు అందజేశామని చెప్పారు. ఈ వారం మరో 2,863 కుటుంబాలకు రూ.353 కోట్లు చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. మిగిలిన 1,898 కుటుంబాలకు ఈ నెలాఖరులోగా రూ.210 కోట్లు చెల్లించి ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## ఆ తేదీల్లో పార్లమెంటు సమావేశాలకు తప్పక హాజరుకావాలి'

# ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్

### ఈనెల 10, 11, 12 తేదీల్లో పార్లమెంటు సమావేశాలకు తప్పక హాజరుకావాలని విప్ జారీ

### లోక్‌సభ, రాజ్యసభలోని కాంగ్రెస్ సభ్యులకు విప్ జారీ

: వచ్చే వారం పార్లమెంట్‌లో కీలకమైన అంశాలు చర్చకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ ఎంపీలకు విప్ జారీ చేసింది. ఈ నెల 10, 11, 12న సభ్యులందరూ తప్పనిసరిగా సభకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు రాజ్యసభ కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేష్ తమ సభ్యులకు మూడు లైన్ల విప్ జారీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి సభ ముగిసే వరకు ఉండి పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే విధమైన విప్‌ను జారీ చేశారు. వచ్చే వారం పార్లమెంట్‌లో విదేశీ విరాళాల చట్ట సవరణ బిల్లు చర్చకు వచ్చే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గాల పునర్విభజనకి సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉందని తెలిసింది. అయితే, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించిన తాత్కాలిక ప్రభుత్వ కార్యక్రమాల జాబితాలో ఖీజ=ూ సవరణ బిల్లు, డీలిమిటేషన్‌కు సంబంధించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావన లేదు.

### పార్లమెంటులో అతిపెద్ద హాస్యాస్పదం కిరణ్ రిజిజు ప్రకటన : వేణుగోపాల్

మరోవైపు పార్లమెంటుకు హోం మంత్రి అమిత్ షా నిరంతరం గైర్హాజరవుతున్నారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఆరోపించారు. పార్లమెంటులో కార్యకలాపాలు సరిగ్గా



జరగకపోవడానికి ప్రతిపక్షాలే కారణమన్న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును ఆయన ప్రశ్నించారు. "ఈ పార్లమెంటులో అతిపెద్ద హాస్యాస్పదం కిరణ్ రిజిజు ప్రకటన. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పార్లమెంటుకు రాకుండా ఎవరు ఆపారు? " అని వేణుగోపాల్ అన్నారు. ఏ మంత్రి ఎప్పుడు సభకు రావాలో ప్రతిపక్షం నిర్ణయించలేదని కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో వేణుగోపాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల ఆటంకాలు ఉన్నప్పటికీ పార్లమెంటు సజావుగా సాగుతోందని, బిల్లులు ఆమోదం పొందుతున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. అలాగే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ లేదని ఆయన తేల్చి చెప్పారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఆటంకాలు, నినాదాల కారణంగా సభలో చర్చలు తగ్గాయని రిజిజు తెలిపారు. "లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభను తప్పుదారి పట్టిస్తున్నారు. సభాపతి నుంచి ఎలాంటి ఆదేశం రాలేదు. నేను ఈ విషయాన్ని అధికారికంగా చెబుతున్నాను: ఉదయం పార్లమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి రాత్రి ముగిసే వరకు హోం మంత్రి పార్లమెంట్‌లోనే ఉంటారు. సభ కార్యకలాపాలకు బాధ్యత వహించే మంత్రి సమాధానం ఇస్తారు. ఏ మంత్రి ఎప్పుడు రావాలో ప్రతిపక్షం నిర్ణయించదు." అని అన్నారు.

### పార్లమెంటు ఉభయసభల్లో వాయిదాలపర్వం

అంతకుముందు నీట్ పేపర్ లీక్, అయోధ్య కానుకల చోరీ అంశాలపై ఆందోళనలతో పార్లమెంటు ఉభయసభల్లో వాయిదాలపర్వం కొనసాగింది. ఎలాంటి కార్యకలాపాలు జరపకుండానే సోమవారానికి వాయిదాపడ్డాయి. ఉదయం 11గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా 1942 ఆగస్టు 9న జరిగిన క్విట్ ఉద్యమం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడారు. క్విట్ ఇలండియా ఉద్యమం సత్యం, అహింసకు ప్రతీక అని పేర్కొన్నారు. యావత్ ప్రపంచం మాదిరిగానే గాంధీ బోధనలను విపక్ష ఎంపీలు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆందోళన చేస్తున్న ఎంపీ ప్రవర్తన పార్లమెంటు నిబంధనలకు అనుగుణంగా లేదని స్పీకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్ష ఎంపీల ఆందోళనల మధ్యే మీవీజు చట్టసవరణ బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. అనంతరం సభ మధ్యాహ్నం 12గంటల వరకు వాయిదా పడింది. ఆ తర్వాత తిరిగి సమావేశమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవటంతో లోక్‌సభ సోమవారానికి వాయిదాపడింది. అటు రాజ్యసభ కూడా సోమవారానికి వాయిదాపడింది.

నేటి దిక్సూచి తెలుగు దిన పత్రిక TGTEL/25/A31
శనివారం- 08 - ఆగస్టు - 2026

# దోమల బెడదతో ప్రజల అవస్థలు అధికారులు జర వెంటనే చర్యలు తీసుకోండి సార్




మంచిర్యాల,: మంచిర్యాల పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దోమల ఉద్ధృతి తీవ్రంగా పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా కాలనీల్లో చిన్నపిల్లలు దోమల కాట్లతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దోమలు కుట్టడంతో పిల్లలు ఒంటిపై, చేతులు, కాళ్లపై గోకుకోవడం వల్ల చర్మ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల దోమల వ్యాప్తి మరింత పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కాలనీల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ (పొగ స్ప్రే) నిర్వహించాలని, డ్రైనేజీలు, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు (హెల్త్ క్యాంపులు) ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సేవలు, మందులు అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని దోమల నివారణతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కేసులకు భయపడేది లేదు.. ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం: బాల్క సుమన్




మంచిర్యాల,:క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులో మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి మంచిర్యాల జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కేసును విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది. అనంతరం మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్, క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు మెజారిటీ ఇచ్చినా, కాంగ్రెస్ పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు అక్రమ మార్గాలను అనుసరించిందని ఆరోపించారు. ప్రజల మద్దతుతో గెలిచిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కోట్ల రూపాయలు, బ్లాంక్ చెక్కులు ఆఫర్ చేసినప్పటికీ వారు లొంగలేదని, అందుకే తమపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నందుకే రాజకీయ కక్షతో కేసులు పెడుతున్నారని ఆరోపించిన ఆయన, గతంలో సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం మాట్లాడినందుకు 20 రోజుల పాటు చంచల్‌గూడ జైలులో ఉంచారని గుర్తు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని, ప్రతిపక్ష నేతలకు ఒక చట్టం, అధికార పార్టీ నేతలకు మరో చట్టం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. “ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ప్రజల పక్షాన మా పోరాటం కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ తరఫున గట్టిగా నిలబడతాం“ అని బాల్క సుమన్ స్పష్టం చేశారు.

## జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహణ

రాజ్యాధికారంలో వాటా కోసం నేత కార్మికులు పోరాటాలు చేయాలి: గజెల్లి వెంకటయ్య






మంచిర్యాల, : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలో జిల్లా భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోలాపూర్, భివండి ప్రాంతాల్లో చేనేత రంగంలో ప్రతిభ కనబరిచిన నేత కళాకారులను పూల బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేసి జీవితాంతం ఉద్యమం చేశారని, తెలంగాణ కోసం సిరిపురపు యాదయ్యతో పాటు అనేక మంది నేత కార్మికులు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 12 సంవత్సరాలు గడిచినా చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగలేదని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే, రాష్ట్రంలో సుమారు 15 శాతం జనాభా కలిగిన పద్మశాలీయులు రాజకీయాలకు అతీతంగా ఐక్యమై రాజ్యాధికారంలో వాటా సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీ, మంత్రివర్గం, కార్పొరేషన్లలో తమకు తగిన ప్రాతినిధ్యం దక్కించుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు రావాలని, రాబోయే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని వెంకటయ్య కోరారు. ఈ సందర్భంగా పద్మశాలి, బీసీ, తెలంగాణకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గజెల్లి వెంకటయ్యతో పాటు పద్మశాలి సంఘం నాయకులు సీహెచ్ మొగిలి, ఏ. సాగర్, కె. కృష్ణమూర్తి, రాజలింగు, మల్లయ్య, రాజమౌళి, లచ్చయ్య, నారాయణ, చిందం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మహిళ ఆకస్మిక మృతి.. తిర్యాణిలో విషాద ఛాయలు

తల్లి మృతితో ఇద్దరు కుమార్తెల రోదనలు.. కన్నీటి సంద్రంలో కుటుంబ సభ్యులు



తిర్యాణి, : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల కేంద్రానికి చెందిన గున్నాల సుమలత (40) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆమెకు తీవ్ర గుండెపోటు రావడంతో వెంటనే తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుమలత ఆకస్మిక మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతురాలికి భర్త రమేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి ఇక లేదనే చేదు నిజాన్ని జీర్ణించుకోలేక చిన్నారులు బోరున విలపించిన దృశ్యాలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి. బంధువులు, గ్రామస్తులు కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు ప్రయత్నించినా వారి రోదనలు అందరినీ కలచివేశాయి. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే తిర్యాణి మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆమె నివాసానికి చేరుకుని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రైతుల కోసం వట్టివాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని వినతి...






కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా : జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు వట్టివాగు ప్రాజెక్టు డీఈ గారిని కలిసి, జిల్లాలోని రైతుల సాగు అవసరాల కోసం వట్టివాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం రైతులు వరి పంటతో పాటు ఇతర పంటల సాగుకు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, సరైన సమయంలో నీరు అందితే పంటలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వారు డీఈ గారి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని వట్టివాగు ప్రాజెక్టు నుంచి సాగునీటిని త్వరగా విడుదల చేయాలని కోరారు. రైతుల సమస్యపై డీఈ గారు సానుకూలంగా స్పందించి, నీటి విడుదలకు సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మాణిగొండ వెంకటేశం పటేల్, తాలూకా అధ్యక్షులు గాజుల జక్కయ్య పటేల్, గడ్డల శంకర్ పటేల్, గడ్డల సురేష్ పటేల్, మెకార్తి కాశయ్య పటేల్, పొల్లంపల్లి గణపతి పటేల్, పెద్దపల్లి శంకర్ పటేల్, మిట్ట తిరుపతి పటేల్, మిట్ట పోషన్న పటేల్, బూసి భీమేష్ పటేల్, రుకుం ప్రహ్లాద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. రైతుల పంటలకు సకాలంలో సాగునీరు అందించి, వట్టివాగు ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం కల్పించాలని జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు కోరారు.

## అంకుషాపూర్ లో తల్లిపాల వారోత్సవాలు.







భీమారం, : భీమారం మండలం అంకుషాపూర్ లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని చంటి బిడ్డ తల్లులకు అవగాహన కల్పించారు. తల్లి బిడ్డకు కావలసిన పౌష్టికాహారం, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ సతీష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ దర్శనాల ప్రమీల డిటి అంజమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుప్రీత, ఉమెన్ హబ్ లిప్సిక, అంగన్వాడీ టీచర్స్, బెనిఫిషర్స్ పాలిచ్చే తల్లులు,కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సొంత ఊరికి ఎంతో కొంత సహాయం చేయాలి.

కొత్తపల్లి సర్పంచ్ దుర్గం తిరుపతి.



భీమారం, : భీమారం మండలం కొత్తపల్లి గ్రామం లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగి, కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు యాసం శ్రీనివాస్ విద్యార్థుల మధ్యాహ్న భోజనం కొరకు 45 ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గం తిరుపతి మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు యాసం శ్రీనివాస్ హాస్టల్ వార్డెన్ గా ఉద్యోగం సాధించిన తర్వాత సొంత ఊర్లో ఉన్న పాఠశాల విద్యార్థులకు తనకు తోచిన విధంగా సహాయం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా తమ సొంత ఊరికి ఎంతో కొంత సహాయాన్ని చేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఆషాడ బోనాలు

ముఖ్య అతిథిగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి



మంచిర్యాల,: ఇరిగేషన్ శాఖ లో టీఎన్జీవో మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల ప్రకారం ఏర్పాటుచేసిన ఆషాడ మాస బోనాలలో ముఖ్య అతిథిగా టిఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి , విశిష్ట అతిథిగా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు పాల్గొన్నారు. ముఖ్య అతిథి గడియారం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢ మాసంలో ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో అమ్మ వారిని పూజిస్తారని. అమ్మ దయవల్ల రాష్టం సుభిక్షంగా ఉండాలని అభివృద్ధి చెందాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. ముఖ్యఅతిథి టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియార శ్రీహరి ని ఘనంగా సన్మానం చేశారు . ఈ బోనాల వేడుకలలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా సంయుక్త కార్యదర్శి రోశయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి అంజయ్య జ్యోతి అరుణ ముత్తన్న తదితరులు పాల్గొన్నారు..

# జూబ్లీ మార్కెట్‌లో చాయ్ హోటల్ ప్రారంభం



ఆసిఫాబాద్ : చిన్న వ్యాపారులను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణం జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో నూతన చాయ్ హోటల్ ను డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, డిసిసి ఉపాధ్యక్షుడు తరిఖ్, మండల అధ్యక్షులు రాపర్తి మురళి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కాశిఫ్ హష్మీ ఇమ్రాన్, మాజీ ఎంపిటిసి సిడాం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు ఇల్లూరి రాము, భాను చందర్, మెంగ్రె మోహన్, ఉప్పల కృష్ణ, మహమ్మద్ సఫి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలగల సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద రహిత వాతావరణంలోనే పాక్‌తో సంబంధాలు ముందుకు సాగుతాయి

పుల్వామా ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్ కు ఇచ్చిన అత్యంత ప్రాధాన్యాన్ని భారత్ ఉపసంహరించుకుందన్న విదేశాంగ శాఖ – పహల్గాం దాడికి బదులుగా కఠినమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపిన జైశంకర్



ఉగ్రవాద రహిత వాతావరణంలోనే పాకిస్థాన్‌తో సంబంధాలు ముందుకు సాగుతాయని భారత్ స్పష్టం చేసింది. పాక్ ఇప్పటికీ ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా వాడుకుంటూ సరిహద్దు ఉగ్రవాదానికి పాల్పడుతోందని కేంద్రం పార్లమెంట్ కు శుక్రవారం తెలియజేసింది. ఈ మేరకు లోక్ సభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్ కు ఇచ్చిన అత్యంత ప్రాధాన్యాన్ని భారత్ ఉపసంహరించుకుందని, పాకిస్థాన్ లో తయారయ్యే లేదా అక్కడి నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాన్ని 200 శాతానికి పెంచిందని తెలిపారు. అలాగే, 2025 ఏప్రిల్ 22న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన పహల్గాం దాడికి బదులుగా భారత్ కఠినమైన నిర్ణయాలు తీసుకుందని జైశంకర్ చెప్పారు. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారీ చెక్- పోస్ట్ మూసివేయడం, వీసాలపై ఆంక్షలు విధించడం, రెండు దేశాల్లోని రెస్పెక్టివ్ మిషన్లలో అధికారుల సంఖ్యను తగ్గించడం వంటి చర్యలను భారత్ తీసుకుందని తెలిపారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత జమ్ముకశ్మీర్ లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా భారత సైన్యం సైనిక చర్యకు దిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ , పాక్ దేశాలు ఒకరి రాజధానిలో మరొకరు తమ దౌత్య కార్యాలయాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. సైనిక పరంగా డీజీఎంఓ స్థాయి చర్చలు, బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగ పరీక్షలకు సంబంధించిన ముందస్తు సమాచారం పంచుకోవడం, ఇరు దేశాల ఆధీనంలో ఉన్న అణు కేంద్రాలు, ఖైదీల జాబితాల వంటి అంశాలపై ఇరుపక్షాల మధ్య చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించారు. సరిహద్దు ఉగ్రవాదం, దాని మౌలిక సదుపాయాలపై తగిన విధంగా భారత్ స్పందిస్తోందని తెలిపారు.

### ఆపదలో ఉన్న వారి కోసం ‘వన్ స్టాప్ సెంటర్ల‘

ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా హింసకు గురైన లేదా ఆపదలో ఉన్న మహిళలకు సహాయం చేయడానికి ప్రభుత్వం 1,000కి పైగా ‘వన్ స్టాప్ సెంటర్ల‘ను ఏర్పాటు చేసిందని ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభకు తెలియజేసింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ మాట్లాడారు. 2015 ఏప్రిల్ లో ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి 2026 జూన్ వరకు, దేశవ్యాప్తంగా ఈ కేంద్రాల ద్వారా 15 లక్షల మందికి పైగా మహిళలకు సాయం పొందారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో మిషన్ శక్తి కింద ఉన్న పథకాల పనితీరును రియల్ టైమ్ లో పర్యవేక్షించడానికి వీలుగా మంత్రిత్వ శాఖ ‘మిషన్ శక్తి డాష్‌బోర్డ్‘ను రూపొందించిందని ఆమె పేర్కొన్నారు. కాగా, ‘మిషన్ శక్తి‘ మార్గదర్శకాల ప్రకారం, దేశవ్యాప్తంగా ప్రైవేట్, బహిరంగ ప్రదేశాల్లో హింసను ఎదుర్కొంటున్న లేదా ఆపదలో ఉన్న మహిళలకు ఒకే చోట తక్షణ సహాయం అందించడం ఈ వన్ స్టాప్ సెంటర్ల ముఖ్య ఉద్దేశం. మరోవైపు, భూగర్భ జలాలకు సంబంధించి కీలక సమాచారాన్ని కేంద్రం పార్లమెంట్ కు తెలిపింది. 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 502 జిల్లాల్లో, భూగర్భ జలాల్లో అనుమతించదగిన పరిమితి కంటే ఎక్కువ నైట్రేట్ స్థాయిలను సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ గుర్తించినట్లు పేర్కొంది. 2025 వార్షిక భూగర్భ జల నాణ్యతా నివేదికను ఉటంకిస్తూ, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పలు కీలక సమాచారాన్ని అందించారు. విశ్లేషించిన భూగర్భ జల నమూనాలలో 20.71 శాతం అనుమతించదగిన పరిమితిని మించి నైట్రేట్ గాఢతలు ఉన్నట్లు తెలిపారు.

## ప్రయాణ సమయాన్ని ఆదా చేసే గాల్లో ఎగిరే కారు- దేశంలో మొట్టమొదటి ఫ్లయింగ్ వెహికల్ ప్రోటోటైప్ టెస్ట్ సక్సెస్!

యువకుడి అద్భుత ఆవిష్కరణ- ఫ్లయింగ్ వెహికల్‌ను అభివృద్ధి చేసిన ఉత్తరాఖండ్‌కు చెందిన రవి- వెహికల్ ప్రోటోటైప్ పరీక్ష విజయవంతం

పర్వత ప్రాంతాల్లో ప్రయాణం అంటే అంత ఆషామాషీ కాదు. మలుపుల రోడ్లు, ఇరుకైన రహదారులు ఉంటాయి. దీంతో ప్రయాణానికి చాలా సమయం పడుతుంది. అలాగే జర్నీకి టైమ్ కూడా ఎక్కువే పట్టేస్తుంది. అందుకే ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు, రవాణాను సులభతరం చేసేందుకు ఉత్తరాఖండ్‌లోని అల్మోడాకు చెందిన యువ ఆవిష్కర్త రవి తామ్టా కీలక ఆవిష్కరణ చేశారు. ఒక వ్యక్తిగత ఎగిరే వాహనాన్ని (కారు) అభివృద్ధి చేశారు. ఈ ఫ్లయింగ్ కారు ప్రోటోటైప్ టెస్ట్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇంతకీ ఈ ఫ్లయింగ్ కారు ఎలా పనిచేస్తుంది? దీని వల్ల ప్రయాణ సమయంలో ఉన్న ఉపయోగాలేంటి? తదితర విషయాలు తెలుసుకుందాం.

### ఈ వెహికల్‌తో సమయం ఆదా

రవి తమ్టా తాను తయారుచేసి ఫ్లయింగ్ కారు ప్రోటోటైప్ టెస్ట్ గురించి ఈటీవీ భారత్‌తో షేర్ చేసుకున్నారు. తన ఇంటికి వెళ్లే మార్గాన్ని ఆ ఎగిరే వాహనంలో ప్రోగ్రామ్ చేసినప్పుడు ఫలితాలు అద్భుతంగా వచ్చాయని వివరించారు. సాధారణంగా రోడ్డు మార్గంలో ప్రయాణించడానికి సుమారు 40 నిమిషాలు పట్టే దూరాన్ని, ఈ వాహనం ద్వారా గాలిలో కేవలం 12 నిమిషాల్లోనే చేరుకోవచ్చని పేర్కొన్నారు. ఈ వెహికల్ ప్రోటోటైప్ టెస్ట్ సమయంలో ప్రయాణంలో కలిగిన అనుభవం చాలా బాగుందని చెప్పారు. తాను ఎంతోకాలంగా సాకారం చేసుకోవాలని చూస్తున్న కల చివరికి నిజమవుతోందనే భావనను కలిగించిందని అన్నారు. దీనికి ‘హపిడా స్కైనెక్స్‘ అని పేరు పెట్టానని స్పష్టం చేశారు.

### ఏళ్ల తరబడి శ్రమకు దక్కిన విజయం

అయితే ఈ ఫ్లయింగ్ కారు కేవలం ఒక వాహనం మాత్రమే కాదు. రవి సంవత్సరాల తరబడి చేసిన పోరాటం, ప్రయోగాల ఫలితం. రవి వ్యక్తిగత వాయు రవాణా అవకాశాలను అన్వేషించడానికి, వివిధ దశల్లో సాంకేతిక ప్రయోగాలు చేయడానికి కొన్నేళ్లపాటు శ్రమించారు. భవిష్యత్ రవాణాను రోడ్ల నుంచి గాలిలోకి తీసుకెళ్లాలని యోచిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉంది. భవిష్యత్తులో వ్యక్తిగత ఎగిరే వాహనాలు సామాన్య ప్రజల దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో కార్లు, బైక్‌లు ఎలా సాధారణం అయిపోయాయో, భవిష్యత్తులో వ్యక్తిగత ఫ్లయింగ్ వెహికల్స్ కూడా ప్రజలకు అంతే సులభంగా అందుబాటులోకి రావాలని రవి కలలు కంటున్నారు. ఈ క్రమంలో ఫ్లయింగ్ కారు ప్రోటోటైప్ టెస్ట్ సక్సెస్ రవికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. “దేశంలో వ్యక్తిగత వాయు రవాణా రంగంలో ఇదొక ముఖ్యమైన ప్రయోగం. దేశంలో తయారైన మొట్టమొదటి వ్యక్తిగత ఫ్లయింగ్ వాహనం ఇదే. స్వల్ప దూర ప్రయాణాల కోసం రోడ్లతో పాటు వాయు ప్రయాణాన్ని కూడా ప్రజలు ఉపయోగించుకునేలా సాంకేతికతను మరింత అభివృద్ధి చేస్తున్నాను.

# బయటపడ్డ ప్రపంచ దేశాల అప్పులు.. తొలి స్థానంలో అమెరికా భారత్ ఏ స్థానంలో ఉందంటే..?



ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ అప్పులు ఉన్న దేశాల జాబితా విడుదలైంది. ఇందులో అమెరికా తొలి స్థానంలో ఉండటం ఆర్థిక నిపులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అగ్రరాజ్యం అని చెప్పుకుంటున్న అమెరికా.. అప్పుల్లో నెంబర్ వన్ స్థానంలో ఉంది. భారత్ ఏ స్థానంలో ఉందంటే..

US Debt: బయటపడ్డ ప్రపంచ దేశాల అప్పులు.. తొలి స్థానంలో అమెరికా.. భారత్ ఏ స్థానంలో ఉందంటే..?

అమెరికా అంటే సంపన్న దేశమని ప్రపంచం మొత్తం అనుకుంటూ ఉంటుంది. అంతర్జాతీయ కంపెనీలు అన్నీ అక్కడ నుంచే ప్రపంచం మొత్తం విస్తరిస్తున్నాయి. అనేక ఆవిష్కరణలు అమెరికాలో పుట్టుకొస్తున్నాయి. దీంతో అమెరికా అంటే ధనవంతులు ఉండే దేశమని అందరూ భావిస్తూ ఉంటారు. కానీ అది అక్షరాలా నిజం కాదని తేలిది. తాజాగా ప్రపంచ దేశాల ప్రభుత్వ అప్పుల వివరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వాలు తీసుకున్న రుణాలకు సంబంధించిన వివరాలను ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ అంచనాలతో విజువల్ క్యాపిటలిస్ట్ సంస్థ విడుదల చేసింది. దాదాపు ముప్పై దేశాల వివరాలు ఇందులో ఉండగా.. షాకింగ్ విషయాలు వెలుగులో వచ్చాయి. ఎంత అగ్రరాజ్యమైనా సరే అప్పులు చేయడం తప్పదని అమెరికా అప్పుల లెక్కలను బట్టి చూస్తే అర్థమవుతుంది. అమెరికా నెత్తిన ఏకంగా 40 వేల బిలియన్ డాలర్ల భారీ అప్పు ఉన్నట్లు ఈ నివేదికలో తేలింది. ఈ జాబితాలో అమెరికా ఏకంగా తొలి స్థానంలో నిలిచింది. అమెరికాకు ఏకంగా 40 వేల 739 బిలియన్ డాలర్ల అప్పు ఉన్నట్టు తేలింది. ఇక రెండో స్థానంలో చైనా 22 వేల 290 బిలియన్ డాలర్లతో ఉండగా.. జపాన్ మూడో స్థానంలో ఉంది. ఇక బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి.భారతదేశం ఈ జాబితాలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. భారతదేశం 3 వేల 464 బిలియన్ డాలర్ల అప్పు చేసినట్లు బయటపడింది. ఇక ఇటలీ, జర్మనీ దేశాలు ఆరు, ఏడో స్థానాల్లో ఉన్నాయి. ఆ తర్వాత కెనడా, బ్రెజిల్ దేశాలు తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. దేశాల అప్పులను జీడీపీతో పోల్చి చూస్తే.. జీడీపీకి మించి అప్పులు ఉన్న దేశాల్లో జపాన్ అగ్రస్థానంలో ఉన్నట్లు తేలింది. జపాన్ అప్పుల శాతం ఆ దేశ జీడీపీలో 204 శాతానికి పైగా ఉండగా.. ఆ తర్వాత సింగపూర్, సూడాన్ దేశాలు రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. ఇక బహ్రెయిన్, ఇటలీ, గ్రీస్, సెనెగల్, మాల్దీవులు కూడా తమ దేశాల జీడీపీ కంటే ఎక్కువ అప్పులు చేశాయి. అమెరికా విషయానికొస్తే.. ఆ దేశ జీడీపీలో 125 శాతానికి పైగా ఉంగా.. ఉక్రెయిన్ పదో స్థానంలో నిలిచింది. అమెరికన్ డాలర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అక్కడి ట్రెజరీ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు అందరూ ఆసక్తి చూపిస్తూ ఉంటారు. అయితే జపాన్, సింగపూర్, ఇటలీ, గ్రీస్ వంటి దేశాల కంటే అమెరికా వెనుకబటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే అప్పులు అనేవి దేశాల ఆర్థిక వ్యవస్థలపై విపరీతమైన ఒత్తిడికి కలిగిస్తాయి. దేశాల భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి.

# వన్‌ప్లస్ బంపర్ ఆఫర్.. ఊహించని విధంగా భారీ తగ్గింపు..!



ఆగస్టు 7 నుంచి ప్రారంభమయ్యే ఈ సేల్ ఆఫర్లు వన్ ప్లస్ అధికారిక వెబ్‌సైట్ (ాఅవూశ్రీబం.ఱఅ), వన్ ప్లస్ స్టోర్ యాప్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఆఫ్‌లైన్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్లలో లభిస్తాయి. ఈ సేల్ లో వన్ ప్లస్ ఫోన్లపై భారీ తగ్గింపుతో అందించనుంది..": వన్ ప్లస్ సంస్థ తమ కస్టమర్ల కోసం 'వన్ ప్లస్ ఇండిపెండెన్స్ డే సేల్ 2026' (ాఅవూశ్రీబం ×అనవజూవఅనవఅషవ ఖుఎ ఝ్రీవ 2026) ఆఫర్లను ప్రకటించింది. ఈ సేల్‌లో వన్ ప్లస్ స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ఆడియో పరికరాలపై భారీ డిస్కౌంట్లు, బ్యాంక్ ఆఫర్లు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు 7 నుంచి ప్రారంభమయ్యే ఈ సేల్ ఆఫర్లు వన్ ప్లస్ అధికారిక వెబ్‌సైట్ (ాఅవూశ్రీబం.ఱఅ), వన్ ప్లస్ స్టోర్ యాప్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఆఫ్‌లైన్ ఎక్స్‌పీరియన్స్ స్టోర్లలో లభిస్తాయి.

**స్మార్ట్‌ఫోన్ ఆఫర్లు, తగ్గింపులు**

సేల్ సమయంలో వన్ ప్లస్ మోడల్స్‌పై ఆఫర్ ధరలు ఇలా ఉండనున్నాయి:

OnePlus 15: సాధారణ ప్రారంభ ధర రూ.85,999 ఉండగా, ఆఫర్‌లో రూ.81,999 కే లభించనుంది.

OnePlus15=: అసలు ధర రూ.59,999 కాగా, ఈ సేల్‌లో రూ.56,999 లభించనుంది.

OnePlus13: ప్రారంభ ధర రూ.54,999 నుండి తగ్గించి రూ.49,999కే లభిస్తుంది.

OnePlus6,: రూ. 44,999 ఉండగా, ఆఫర్‌లో రూ.41,999 మాత్రమే.

OnePlusNord CE 6: రూ.35,999 నుంచి రూ.31,999కు తగ్గుతుంది.

OnePlusNord CE 6 ాఱఙవ: సాధారణ ధర రూ.25,999 కాగా, సేల్‌లో రూ.23,749 లభిస్తుంది.

OnePlus N6x: ాఅవూశ్రీబం చీ6 మోడల్ రూ.20,999 (అసలు ధర రూ.22,999), మోడల్ రూ.17,499 (అసలు ధర రూ.18,999) లభించనున్నాయి. సేల్ సమయంలో ప్రసిద్ధ వన్ ప్లస్ మోడల్స్‌పై ఆఫర్ ధరలు క్రింది విధంగా ఉండనున్నాయి:

గమనిక: ఎంపిక చేసిన బ్యాంక్ కార్డ్స్‌పై 6 నెలల వరకు నో-కాస్ట్‌సదుపాయం కూడా అందుబాటులో ఉంది.ఆడియో ఉత్పత్తులు మరియు ట్యాబ్లెట్ల ఆఫర్లుఈ సేల్‌లో ట్యాబ్లెట్లు, బడ్స్ పై కూడా ప్రత్యేక డిస్కౌంట్లు ఉన్నాయి.

ట్యాబ్లెట్ బండిల్ ఆఫర్లు:4 (8+ 256+B / 512+B): ఈ ట్యాబ్లెట్ కొనుగోలుపై ాఅవూశ్రీబం ఉచితంగా లభిస్తుంది. ఆఫర్ ధరలు వరసగా రూ.56,499, రూ.61,499.

# తులం బంగారంతో నగలు చేయించుకుంటే ఎంత ఖర్చు అవుతుందో తెలుసా?



సాధారణంగా 22 క్యారెట్ల బంగారం 916 స్వచ్ఛత కలిగి ఉంటుంది. అంటే అందులో 91.6 శాతం మాత్రమే బంగారం ఉంటుంది. మిగితా భాగం ఇతర లోహాలు కలుపుతారు. అప్పుడే ఆ ధృఢత్వం వచ్చి నగలు విరిగిపోకుండా ఉంటాయి. అందుకే 24 క్యారెట్ల.. బంగారం, వెండి ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. గత కొన్ని రోజులుగా భారీగా దిగి వచ్చిన బంగారం ధరలు.. తాజాగా ఎగబాకుతోంది. తులం బంగారం ధర రూ1.50 వద్దకు చేరుకుంటోంది. ఇక మహిళలు అత్యంతగా ఇష్టపడేది నగలు. మరి తులం బంగారంతో నగలు చేయించుకుంటే ఎంత ఖర్చు అవుతుందో చూద్దాం.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంతో మీరు ఏదైనా నగలు చేయించుకుంటే ఎంత ఛార్జీలు పడతాయో తెలుసుకుందాం. ఈ ఛార్జీలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఎందుకంటే ప్రాంతాలను బట్టి ఛార్జీలలో తేడా ఉండవచ్చు. ఎందుకంటే ఆయా రాష్ట్రాల జీఎస్టీ, ఇతర ఛార్జీలలో తేడా ఉండవచ్చని గమనించండి. 24 క్యారెట్ల 10 గ్రాములతో నగలు చేయించుకున్నట్లయితే ఆగస్ట్ 7వ తేదీన తులం బంగారం ధర రూ.1,49,890 వద్ద కొనసాగుతోంది. దీన్ని బట్టి బంగారం విలువం మేకింగ్ ఛార్జీలు సుమారు 12 శాతం తీసుకుంటే సుమారుగా రూ.17,970, అలాగే జీఎస్టీ విలువ 3 శాతం అంటే రూ.5,036 వరకు ఉంటుంది. మొత్తం నగల తయారీకి ఛార్జీలతో కలపుకొంటే రూ.1,72,913 వరకు అవుతుందని గుర్తించుకోండి. అదే 22 క్యారెట్ల తులం బంగారంతో నగలు చేయించుకున్నట్లయితే ప్రస్తుతం ధర రూ.1,37,400 వద్ద కొనసాగుతోంది. ఇదే ధరతో నగలు చేయించుకుంటే మేకింగ్ ఛార్జీలుఏ 12 శాతం (రూ.16,488), జీఎస్టీ 3 శాతం (రూ.4,617)తో మొత్తం నగల ఖర్చు 1,58,505 రూపాయల వరకు అవుతుంది. సాధారణంగా 22 క్యారెట్ల బంగారం 916 స్వచ్ఛత కలిగి ఉంటుంది. అంటే అందులో 91.6 శాతం మాత్రమే బంగారం ఉంటుంది. మిగితా భాగం ఇతర లోహాలు కలుపుతారు. అప్పుడే ఆ ధృఢత్వం వచ్చి నగలు విరిగిపోకుండా ఉంటాయి. అందుకే 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర కన్నా ఈ బంగారం రేటు తక్కువగా ఉంటుంది. ఆన్‌లైన్ వెబ్‌సైట్లలోని వివరాల ప్రకారం ఒక తులం అంటే 10 గ్రాములు. తులం బంగారంతో వివిధ రకాల నగలు తయారు చేస్తుంటారు.

# కాకతీయ పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు.. పోతురాజు విన్యాసాలతో అలరించిన విద్యార్థులు

తుర్కయంజాల్/నేటి దిక్సూచి : తుర్కయంజాల్‌లోని కాకతీయ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాల ఊరేగింపులో డప్పుల మోతల మధ్య పోతురాజు నృత్యాలు చేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం చూపరులను ఆకట్టుకుంది. మహిళలు, విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పావని మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, ఆచారాలను చిన్నారులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వినిత , ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.









# ఈ సింపుల్ ట్రిక్‌తో మీ సిలిండర్‌లో ఎంత గ్యాస్ ఉందో ముందే తెలుసుకోవచ్చు..!






ఈ రెండు చిట్కాలతో పాటు గ్యాస్ అయిపోతోందో లేదో తెలుసుకోవడానికి మీరు ూా+ సిలిండర్ బరువును కూడా తనిఖీ చేయవచ్చు. అంతేకాకుండా మంట నీలం రంగుకు బదులుగా లేత పసుపు, నారింజ లేదా ఎరుపు రంగులో కనిపిస్తే, దాని..

ఎల్పీజీ సిలిండర్ ఎప్పుడు అయిపోతుందో చెప్పడం తరచుగా కష్టంగా ఉంటుంది. కొన్నిసార్లు అకస్మాత్తుగా గ్యాస్ అయిపోతుంటుంది. అలాంటి సమయంలో వంట చేయడం నిలిచిపోతుంది. కేవలం ఒకే సిలిండర్ ఉన్నవారికి ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. అటువంటి పరిస్థితులలో రీఫిల్ కోసం 2-3 రోజులు వేచి ఉండాల్సి రావచ్చు. కొన్ని నగరాల్లో ఈ నిరీక్షణ కొన్ని రోజుల వరకు కూడా ఉండవచ్చు.

మీరు ఇలాంటి సమస్యను నివారించాలనుకుంటే మీ సిలిండర్ అయిపోకముందే దాన్ని కనుక్కోవాలి. దీనికోసం మీరు కేవలం రెండు సులభమైన చిట్కాలను పాటించాలి. ఇందులో మీకు ఆ రెండు ట్రిక్స్ గురించి తెలుసుకుందాం..

LGP గ్యాస్ కొరతను గుర్తించడానికి వేడి నీటిని ఉపయోగించండి:

వేడి నీటిని ఉపయోగించి కేవలం కొన్ని సెకన్లలోనే ఎల్పిజి గ్యాస్ అయిపోవడాన్ని గుర్తించవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోవచ్చు. మీకు కావలసిందల్లా ఒక గ్లాసు వేడి నీళ్ళు మాత్రమే.

ఈ చిట్కాను ప్రయత్నించడానికి ముందుగా ఒక గ్లాసు వేడి నీళ్ళు తీసుకోండి.

ఇప్పుడు ఈ నీటిని సిలిండర్ బయటి ఉపరితలంపై పై నుండి కిందికి నెమ్మదిగా పోయండి.

వేడి నీళ్ళు పోసిన తర్వాత సుమారు 10 సెకన్ల పాటు ఆగండి.

సుమారు 10 సెకన్ల తర్వాత మీ చేతితో సిలిండర్‌ను తేలికగా తాకడానికి ప్రయత్నించండి.

సిలిండర్ ఉపరితలం ఎక్కడైతే మీకు చల్లగా అనిపిస్తుందో అక్కడ ఇంకా ఎల్‌పిజి గ్యాస్ ఉంటుంది. ఎందుకంటే సిలిండర్ లోపల ఉన్న ద్రవరూప గ్యాస్ బయటి వేడిని గ్రహించి, ఆ ప్రాంతాన్ని చల్లబరుస్తుంది. అయితే గ్యాస్ బయటకు వెళ్ళిపోయిన చోట, సిలిండర్ బయటిభాగం త్వరగా వేడిగా అనిపిస్తాయి.

మీరు తడి గుడ్డ సహాయంతో..

వేడి నీటితో పాటు, తడి దూది గుడ్డ సహాయంతో కూడా ఎల్‌పిజి గ్యాస్ తరిగిపోవడాన్ని మీరు తనిఖీ చేయవచ్చు. ఉదాహరణకు..

ఎంత LGP గ్యాస్ అయిపోయిందో తెలుసుకోవడానికి ముందుగా ఒక తడి దూది గుడ్డను తీసుకోండి.

ఇప్పుడు ఈ తడి గుడ్డను గ్యాస్ సిలిండర్ చుట్టూ పై నుండి కిందికి చుట్టి, 1 నుండి 2 నిమిషాల పాటు అలానే వదిలేయండి.

1 నుండి 2 నిమిషాల తర్వాత సిలిండర్ నుండి వస్త్రాన్ని తీసివేయండి.

సిలిండర్‌లో పొడిగా కనిపించే భాగంలో గ్యాస్ అయిపోయి ఉంటుంది. ఎందుకంటే ఆ భాగం వేడిగా ఉంటుంది.

అదే సమయంలో మీకు ఏ భాగం తడిగా, చల్లగా అనిపిస్తుందో అది గ్యాస్‌తో నిండి ఉందని అర్థం చేసుకోండి.

ఈ రెండు చిట్కాలతో పాటు గ్యాస్ అయిపోతోందో లేదో తెలుసుకోవడానికి మీరు ూా+ సిలిండర్ బరువును కూడా తనిఖీ చేయవచ్చు. అంతేకాకుండా మంట నీలం రంగుకు బదులుగా లేత పసుపు, నారింజ లేదా ఎరుపు రంగులో కనిపిస్తే, దాని ద్వారా కూడా సిలిండర్‌లో గ్యాస్ అయిపోతోందో లేదో నిర్ధారించుకోవచ్చు

# రూ.2 లక్షల డౌన్ పేమెంట్ చెల్లించి టాటా నెక్సాన్ కొంటే EMI ఎంత ఉంటుంది?

మీ వడ్డీ రేటు, లోన్ ఆమోదం పూర్తిగా మీ జ×దీ×ూ స్కోర్‌పై ఆధారపడి ఉంటాయి. మీ క్రెడిట్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉంటే, బ్యాంకులు మీకు 9% అంత తక్కువ వడ్డీ రేట్లకే కార్ లోన్‌లను అందించగలవు.. భారతదేశంలో టాటా మోటార్స్ వాహనాలు బాగా అమ్ముడవుతున్నాయి. రాబోయే కాలంలో ఆటోమొబైల్ మార్కెట్‌లో టాటా వాహనాలపై క్రేజ్ మరింత పెరగవచ్చు. ఎందుకంటే ప్రజలు క్రమంగా టాటా వాహనాలపై నమ్మకం పెంచుకుంటున్నారు. ఇక భారతీయ ఆటోమొబైల్ మార్కెట్‌లో సురక్షితమైన, దృఢమైన, ఫీచర్లతో కూడిన కాంపాక్ట్ ూఖఎని కొనాలంటే ముందుగా టాటా నెక్సాన్ పేరే వస్తుంది. 5-స్టార్ సేఫ్టీ రేటింగ్‌తో వస్తున్న ఈ కారు, దాని సెగ్మెంట్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న వాహనాల్లో ఒకటి. చాలా మంది ఈ వాహనాన్ని కొనాలనుకుంటారు. కానీ మొత్తం డబ్బును ఒకేసారి చెల్లించడం అందరి బడ్జెట్‌లో ఉండదు.

అయితే, మీరు ఈ పండుగ సీజన్‌లో లేదా రాబోయే రోజుల్లో మీ మొదటి ూఖఎగా టాటా నెక్సాన్ బేస్ వేరియంట్‌ను కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తుంటే ఈ వార్త మీ కోసమే. కేవలం రూ.2 లక్షల డౌన్ పేమెంట్‌తో మీరు ఈ అద్భుతమైన ూఖఎని ఇంటికి తీసుకురావచ్చు. అందుకే రూ.2 లక్షలు చెల్లించిన తర్వాత మీరు ఎంత బ్యాంక్ లోన్ చెల్లించాల్సి ఉంటుందో.. ప్రతి నెలా ఎంత జువీ× చెల్లించాలో తెలుసుకుందాం.

అద్భుతమైన టూర్ ప్యాకేజీ.. రూ. 3.46 లక్షలకే 10 రోజుల జపాన్ యాత్ర

అయితే, మీరు ఈ పండుగ సీజన్‌లో లేదా రాబోయే రోజుల్లో మీ మొదటి ూఖఎగా టాటా నెక్సాన్ బేస్ వేరియంట్‌ను కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తుంటే, ఈ వార్త మీ కోసమే. కేవలం ?2 లక్షల డౌన్ పేమెంట్‌తో మీరు ఈ అద్భుతమైన ూఖఎని ఇంటికి తీసుకురావచ్చు. కాబట్టి, ?2 లక్షలు చెల్లించిన తర్వాత మీరు ఎంత బ్యాంక్ లోన్ చెల్లించాల్సి ఉంటుందో మరియు ప్రతి నెలా ఎంత జువీ× చెల్లించాలో తెలుసుకుందాం.

బేస్ వేరియంట్ ధర

గమనించదగ్గ విషయం ఏమిటంటే టాటా నెక్సాన్ బేస్ వేరియంట్ అయిన స్మార్ట్ పెట్రోల్ ధర సుమారుగా రూ.7.37 లక్షల (ఎక్స్-షోరూమ్, ఇండియా) నుండి ప్రారంభమవుతుంది. అయితే, మీరు వాహనాన్ని షోరూమ్ నుండి బయటకు తీసుకువెళ్లినప్పుడు దానికి ూు ఛార్జీలు, రోడ్ టాక్స్, వాహన బీమా, ఇతర ప్రభుత్వ పన్నులు ఉంటాయి.ఈ అవసరమైన ఖర్చులన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో ఈ వాహనం ఆన్-రోడ్ ధర సుమారు రూ.8.28 లక్షలకు చేరుకుంటుంది. స్థానిక




పన్నులు, బీమా పాలసీలను బట్టి వివిధ రాష్ట్రాలు, నగరాల్లో ఆన్-రోడ్ ధరలలో స్వల్ప వ్యత్యాసాలు ఉండవచ్చు.

7 సంవత్సరాల జువీ× గణితం:

ఇప్పుడు వాహన ఫైనాన్సింగ్, దాని లెక్కలను పరిశీలిస్తే.. మీరు బేస్ టాటా నెక్సాన్ స్మార్ట్ పెట్రోల్ మోడల్ కోసం మీ స్వంత జేబు నుండి రూ.2 లక్షల డౌన్ పేమెంట్ చేస్తే, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణం ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. రూ.8.28 లక్షల ఆన్-రోడ్ ధర నుండి రూ.2 లక్షలు తీసివేసిన తర్వాత మీ మొత్తం రుణ మొత్తం సుమారుగా రూ.6,28,000 అవుతుంది.

మీరు ఏదైనా ప్రధాన జాతీయ లేదా ప్రైవేట్ బ్యాంకు నుండి 7 సంవత్సరాల కాలపరిమితికి 9% వార్షిక వడ్డీ రేటుతో కారు లోన్ తీసుకుంటే మీ నెలవారీ సుమారుగా రూ.10,111 ఉంటుంది. ఈ 7 సంవత్సరాల కాలపరిమితిలో మీరు బ్యాంకుకు మొత్తం సుమారుగా రూ.2.21 లక్షల వడ్డీని చెల్లిస్తారు.

5 సంవత్సరాల జువీ× గణితం

చాలా మంది కారు కొనుగోలుదారులు కారు త్వరగా రుణ రహితం కావడానికి, వడ్డీని తగ్గించుకోవడానికి, 7 సంవత్సరాల వంటి దీర్ఘకాలిక రుణానికి బదులుగా 5 సంవత్సరాల రుణాన్ని ఎంచుకుంటారు. మీరు అదే 9% వడ్డీ రేటుతో 5 సంవత్సరాల రుణాన్ని మరియు రూ.6.28 లక్షల రుణ మొత్తాన్ని ఎంచుకుంటే, మీకు అదే రుణ మొత్తం లభిస్తుంది.

అందుకే మీ నెలవారీ జువీ× సుమారుగా రూ.13,036కి స్వల్పంగా పెరుగుతుంది. అయితే, 5 సంవత్సరాల ఆప్షన్‌ను ఎంచుకోవడంలో ఉన్న ఒక ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, మీరు బ్యాంకుకు గణనీయంగా తక్కువ వడ్డీ చెల్లిస్తారు. 5 సంవత్సరాలలో మీ మొత్తం వడ్డీ సుమారుగా రూ.1.54 లక్షలు మాత్రమే ఉంటుంది. దీనివల్ల మీకు నేరుగా వేల రూపాయలు ఆదా అవుతాయి. అంతేకాకుండా, మీ వడ్డీ రేటు, లోన్ ఆమోదం పూర్తిగా మీ జ×దీ×ూ స్కోర్‌పై ఆధారపడి ఉంటాయి. మీ క్రెడిట్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉంటే, బ్యాంకులు మీకు 9% అంత తక్కువ వడ్డీ రేట్లకే కార్ లోన్‌లను అందించగలవు. దీనివల్ల మీ నెలవారీ జువీ× మరింత తగ్గుతుంది. అందువల్ల కారు బుక్ చేసే ముందు రెండు లేదా మూడు వేర్వేరు బ్యాంకుల లోన్ పథకాలను, ప్రాసెసింగ్ ఫీజులను తప్పకుండా పోల్చి చూసుకోండి.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815